# సారంగీకి మారుపేరు పండిత్ రామ్‌నారాయణ్

డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్

దేశానికి వన్నెతెచ్చే హిందూస్తానీ శాస్త్రీయ సంగీత కళాకారులలో ముఖ్యుడు సారంగీ విద్వాంసుడు పండిత్ రామ్‌నారాయణ్. ఈనాడు రకరకాల వాయిద్యాలమీద శాస్త్రీయ సంగీతం వాయిస్తున్నారు కాని పూర్వకాలంలో గాత్రం, వీణ మాత్రమే శాస్త్రీయ సంగీతానికి తగినవిగా భావించేవారు. ఆధునిక యుగంలో ఒక్కొక్క వాయిద్యానికీ మారుపేరు అనదగిన హిందూస్తానీ కళాకారులెందరో ఉన్నారు. వేణువుకు పన్నాలాల్ ఘోష్, సితారుకు రవిశంకర్, షహనాయికి బిస్మిల్లా, సంతూర్‌కు శివకుమార్ శర్మ వగైరాల సరసన చేర్చదగిన వ్యక్తి రామ్‌నారాయణ్. ఇటీవల ఆయనకు 75 ఏళ్ళు నిండిన సందర్భంగా ముంబాయిలో ఆయనకు ఘనసన్మానం జరిగింది. అనంతరం రామ్‌నారాయణ్, ఆయన కుమార్తె అరుణ, మనమడు (పౌత్రుడు) హర్ష్ ముగ్గురూ కలిసి సారంగీల సంగీత కచేరీ చేశారు. సారంగీ వాయిద్యం గురించీ, రామ్‌నారాయణ్ గురించీ పరిచయం చేసే ప్రయత్నమే ఈ వ్యాసం.

సారంగీ శబ్దం మనకు ముగల్ కట్టడాలనూ, ఆ నాటి రాజభవనాలనూ, మేలిముసుగులు ధరించిన రాచరికపు స్త్రీలనూ, నవాబులనూ తలపిస్తుంది. మనం తరుచుగా చూసే సినిమాల్లో, డాక్యుమెంటరీల్లో కశ్మీర్ అనగానే సంతూర్ సంగీతాన్నీ, పై సన్నివేశాలకు సారంగీనీ మ్యూజిక్ డైరెక్టర్లు తరుచుగా వాడుతూంటారు. ప్రముఖ రాజకీయ నాయకులు కాలం చేసినప్పుడల్లా రేడియో, టీవీల్లో వినబడేది కూడా సారంగీ సంగీతమే. హిందూస్తానీ శాస్త్రీయ సంగీతంతో పరిచయం ఉన్నవారికి మాత్రం సారంగీ అనేది గాయకులకు పక్కవాద్యంగా ఉపకరిస్తుందని తెలుసు. అటువంటి సారంగీ పక్కవాద్యంగానే కాక ఈనాడు సోలో కచేరీ వాయిద్యంగా కూడా ప్రతిష్ఠ పొందిందంటే అందులో రామ్‌నారాయణ్ పాత్ర అతి ముఖ్యమైనది.

పాత హిందీ సినిమాల్లో రామ్‌నారాయణ్ చాలా పాటలకు సారంగీ వాయించారు. శంకర్-జైకిషన్ సారథ్యంలో సీమా చిత్రంలోని లతా మంగేశ్కర్ జైజైవంతి రాగంలో పాడిన "మన్ మోహనా బడే ఝూఠే" అనే పాటకు సారంగీ వాయించడమే కాక స్వరకల్పనలోనూ రామ్‌నారాయణ్ సహాయం చేశారట. నౌషాద్ సంగీతాన్నందించిన గంగా జమునాలో లతా పాడిన "దో హంసోంకా జోడా" అనే పాటలో సారంగీ అద్భుతంగా పలికిందంటే అది పండిత్‌జీ చలవే. కశ్మీర్ కీ కలీలో "దీవానా హువా బాదల్" అనే పాటలో ఓ.పి. నయ్యర్ బాణీకి వన్నె తెచ్చిందీ ఆయనే. ఇవి ఆయన శాస్త్రీయ కళకు నిదర్శనాలు కాకపోయినా పామరులను ఆకట్టుకున్నాయనేది మరచిపోరాదు.

సారంగీ టెక్నిక్‌లో రామ్‌నారాయణ్ ప్రతిభ అసామాన్యం. శాస్త్రీయ రాగాలపై ఆయనకు ఉన్న అధికారమూ, మూడు స్థాయిలలోనూ అవలీలగా సాగే స్వరప్రస్తారమూ కొట్టవచ్చినట్టు వినిపిస్తాయి. కేవలం పక్కవాద్యంగా అణిగి ఉండకుండా ఎంతో అగ్రెసివ్‌గా పలుకుతుంది ఆయన సారంగీ. అసలు సారంగీ గాత్రం లాగే వినబడుతుంది. గాయకులను మించిన ఆర్తీ, ఆవేదనా పలుకుతాయి. గుండెల్ని పిండేసే ఆ ఆవేశాన్ని చాలామంది శ్రోతలు భరించలేరు కూడా. ఈ లక్షణాలన్నీ రామ్‌నారాయణ్ సంగీతంలో ఉన్నాయి.

వ్యక్తిగతంగా రామ్‌నారాయణ్ నిరాడంబరుడే అయినా చెప్పేదేదో నిర్మొహమాటంగా చెప్పగలరు. ఇతర సంగీత కళాకారుల గురించి తనకు నచ్చని విషయాలను కుండ పగలేసినట్టుగా చెప్పడానికి వెనకాడడు. నేను ఆయనను కలుసుకున్నప్పుడు అనేక విషయాలు ముచ్చటించటం జరిగింది.

సారంగీకి సంగీత ప్రపంచంలో తగిన గుర్తింపు రాలేదనేబాధ ఆయనకు ఎక్కువ. తానొక్కడూ ఎంత శ్రమ పడినప్పటికీ ఈ రోజుల్లో సారంగీవిని ఆనందించేవారూ, కచేరీలు ఏర్పాటు చేసేవారూ తగ్గిపోయారనేది ఆయన ఫిర్యాదు. ఈ పరిస్థితుల దృష్ట్యా ఆయన తన కుమారుడైన బ్రిజ్‌నారాయణ్‌కు సారంగీ నేర్పకుండా సరోద్ నేర్పించాడు. బ్రిజ్‌నారాయణ్ నేటి మేటి సరోద్ కళాకారుల్లో ఒకరు. ఆయనకుమార్తె అరుణా కల్లే మాత్రం సారంగీలో మంచి నైపుణ్యం సంపాదించి ప్రస్తుతం తన భర్తతో కెనడాలో నివాసముంటోంది. రామ్‌నారాయణ్ ప్రతిభకు వారసులు వీరే.

రామ్‌నారాయణ్ సారంగీ గురించి చాలా విషయాలు చెప్పారు.
దక్షిణాదిలో గాయకులకు వయొలిన్ లాగే ఉత్తరాది గాయకులకుసారంగీని పక్కవాద్యంగా వాడతారు. గాయకులు పలికించే గమకాలన్నీ అదే స్థాయిలోయథాతథంగా సారంగీమీద పలుకుతాయి. ఈ కారణంగా కొందరు గాయకులు సారంగీ తమ గాత్రంతో పోటీ పడుతుందని చిరాకు పడడం కద్దు. అటువంటివారు సారంగీకి బదులుగా హార్మోనియం ఉపయోగించడానికి ఇష్టపడతారు. హార్మోనియం మన రాగసంగీతానికి పూర్తిగా న్యాయం చెయ్యలేదనే కారణంగా వి. బి. కేస్కర్ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆకాశవాణిలో దాన్ని నిషేధించడం జరిగింది. ఆ విధంగా రేడియోలో సారంగీ వినబడే అవకాశాలు పెరిగాయి. అయినప్పటికీ హార్మోనియం అలవాటయిన ఉస్తాద్ అమీర్‌ఖాన్ వంటి మహా గాయకులు సారంగీ అంటే ఇష్టపడనందువల్ల కేవలం తబలాతోనే రేడియో సంగీత కచేరీలు చేశారు. తమాషా ఏమిటంటే అమీర్‌ఖాన్, బడేగులామ్ అలీ ఖాన్‌లు ఇద్దరూ కూడా సారంగీ వాయిద్యకారుల వంశాల్లో జన్మించినవారే. ఎటొచ్చీ మొదట్లో జానపద వాయిద్యంగా

ఉండిన సారంగీ క్రమంగా నాట్యకత్తెలకు పక్కవాయిద్యంగా పతనం చెందడంతో తమ సారంగీ సంప్రదాయం గురించి చెప్పుకోవడమంటే కొందరు విద్వాంసులకు ఇష్టం ఉండేది కాదు.

రామ్‌నారాయణ్ 1925లో రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జన్మించారు. వారి వంశంలో అయిదారు తరాల నుంచీ శాస్త్రీయ సంగీత సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. రామ్‌నారాయణ్ తండ్రి నాథూజీ బియావత్ సారంగీని పోలిన దిల్‌రుబా అనే వాయిద్యంలో దిట్ట. సారంగీలాగా కాకుండా దానికి సితార్‌లాగా మెట్లుంటాయి. రామ్‌నారాయణ్ అయిదేళ్ళవాడై ఉండగానే ఒక చిన్న సారంగీ తీసుకుని వాయించడం మొదలుపెట్టాడట. ఏడో ఏటినుంచీ పద్ధతి ప్రకారం సాధన మొదలయింది. మాధవప్రసాద్, పండిత్ ఉదయలాల్, ఉస్తాద్ వహీద్‌ఖాన్ వంటి విద్వాంసుల మార్గదర్శకత్వంలో శిక్షణ పొంది, తన పధ్నాలుగో ఏటనే రామ్‌నారాయణ్ లాహోర్ రేడియో స్టేషన్‌లో సారంగీ వాద్యకారుడిగా ఉద్యోగం సంపాదించాడు. స్వాతంత్ర్యానంతరం ఆయన ఢిల్లీ ఆలిండియా రేడియోకు వచ్చారు. రామ్‌నారాయణ్ ఎన్నో సంవత్సరాలపాటు బడేగులాంఅలీఖాన్, ఓంకార్‌నాథ్ ఠాకుర్ వంటి అనేక ప్రసిద్ధ గాయకులకు పక్కవాద్యం వాయించారు. ఆ అనుభవంవల్ల ఆయనకు సంగీతం గురించిన అవగాహన పెరిగింది. తరవాత ఆయన బిస్మిల్లాఖాన్ వంటి దిగ్గజాలతో జుగల్‌బందీ కచేరీలు కూడా చేశారు.

రామ్‌నారాయణ్ అన్నగారు పండిత్ చతుర్‌లాల్ మంచి తబలా విద్వాంసుడు. చిన్న వయసులోనే కాలం చేసిన ఈ ప్రతిభావంతుడు మొదట్లో పండిత్ రవిశంకర్‌తో దేశవిదేశాల్లో పర్యటించారు కూడా. ఆయన సాంగత్యం తొలిరోజుల్లో రామ్‌నారాయణ్‌ను ప్రభావితం చేసింది. వీరిద్దరూ కలిసి జర్మనీ వగైరా దేశాల్లో వాయించిన కచేరీలు అక్కడి శ్రోతలను ఉర్రూత లూగించాయి.

1950 దశకంలోనే రామ్‌నారాయణ్ సారంగీ మీద పరిశోధనలు మొదలుపెట్టి, సారంగీ నిర్మాణంలోనూ, కమాను వేసే పద్ధతిలోనూ కొన్ని మార్పులు ప్రవేశపెట్టారు. గట్టి ఆత్మవిశ్వాసంతో సారంగీకి స్వయం ప్రతిపత్తి కలిగించడానికి కృషి చేసి అందరూ హర్షించకపోయినా సోలో కచేరీలు ప్రారంభించారు. క్రమంగా పక్క వాయిద్యం వాయించడం మానుకున్నారు. ఈ పట్టుదలకు 1957నుంచీ మంచి ఫలితాలు కలగసాగాయి. ఆయనకు పద్మశ్రీ, పద్మభూషణ్, సంగీత నాటక అకాడమీ బహుమతీ, అనేక ఇతర గౌరవ సన్మానాలూ లభించడమే కాక దేశవిదేశాల్లో కచేరీలు చేసే అవకాశాలు కలిగాయి. యెహూదీ మెనూహిన్ వంటి విశ్వవిఖ్యాత సంగీతజ్ఞులు ఆయన ప్రతిభను కొనియాడారు. తన జీవితంలో సంగీతానికి చేసిన సేవకు గుర్తింపుగా రామ్‌నారాయణ్‌కు 1999లో ఆదిత్య విక్రమ్ బిర్లా కళాశిఖర పురస్కారం లభించింది.

సినిమా వాతావరణం సరిపడని రామ్‌నారాయణ్ తాను రేడియో ఉద్యోగం మానుకున్నాక కేవలం ఆర్థిక పరిస్థితుల కారణంగానే సినిమాల్లో వాయించవలసి వచ్చిందని అంటారు. ఆయనకు భారతీయ సంగీత సంప్రదాయం అంటే ఎంతో గర్వం. రాజీ ధోరణి ఏమాత్రం నచ్చదు. సారంగీ అనేది నూరు రంగులు వెదజల్లగలిగిన "సౌ రంగీ" అంటారాయన. ఆయనకు సమకాలికుడూ, అతి ప్రతిభావంతుడూ అయిన సారంగీ విద్వాంసుడు ఉస్తాద్ సుల్తాన్‌ఖాన్ లాగా గజల్ సంగీతానికీ, ఫ్యూజన్ సంగీతంలో నూతన ప్రయోగాలకూ ప్రయత్నించడం ఆయనకు సరిపడదు.

రామ్‌నారాయణ్ శిష్యులకు సంగీతం నేర్పడమంటే ఆసక్తి. వయసు పైబడుతున్నందు వల్ల తన సంప్రదాయం తనతోనే అంతరించిపోకుండా ఉండాలని ఆయన తాపత్రయం. ఏడు దశాబ్దాలుగా సారంగీ సంగీతానికి మారుపేరుగా నిలిచిన పండితుడు రామ్‌నారాయణ్.

=============================================================